ఈనాడు వరంగల్

మంగళవారం అక్టోబరు 22, 2024 5





గంటసేపు దంచి కొట్టింది!

వరదనీటిలో పలు కాలనీలు

– కార్పొరేషన్, వరంగల్ వ్యవసాయం, కాజీపేట, న్యూస్‌టుడే

అంబేడ్కర్‌భవన్ రోడ్డులో..

హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇబ్బంది

నగరంలో సోమవారం సాయంత్రం గంట వ్యవధిలో కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటలకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో కాలనీల్లో వరద పోటెత్తింది. హనుమకొండ బస్టాండ్ వర్షపు నీటిలో మునిగింది. ప్రశాంత్‌నగర్, ఎస్బీహెచ్ కాలనీ, భవానీ నగర్, అంబేడ్కర్ భవన్, ఆర్ఈసీ రోడ్లు కేయూ వంద అడుగుల రోడ్డు, కాజీపేట డీమార్టు, ఎన్ఐటీ సమీపంలోని రామకృష్ణ కాలనీల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. ఉదయం వరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉడికిపోయిన నగరం సాయంత్రం భారీ వర్షంతో చల్లబడింది.



పాత బీటుబజారులో నిలిచిన వరద



బాల'సముద్రం'లో

❒ వరంగల్ ప్రాంతంలోని పాత బీటుబజారు, బట్టలబజారు, గోపాలస్వామిగుడి, పోచమ్మమైదాన్ సెంటర్లో భారీ వర్షం పడింది. బీటుబజారు, పాత నవీన్ టాకీస్ గల్లీలోని దుకాణాల్లోకి వరదనీరు చేరింది. గంటపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ అధికారులు, ఉద్యోగులను అప్రమత్తం చేశారు. డీఆర్ఎఫ్ టీం, ప్రజారోగ్య విభాగం పారిశుద్ధ్య కార్మికులు రంగంలోకి వరదనీళ్లను క్లియర్ చేశారు. రెండు నుంచి మూడు గంటల పాటు ప్రజా రవాణాకు అంతరాయం ఏర్పడింది.

వర్షపాతం: కాజీపేట కేంద్రంలో అత్యధిక(హెవీ రెయిన్) వర్షపాతం 65.05 మిల్లీమీటర్లు పడింది. గీసుకొండ 56.3, హసన్‌పర్తి 40, ఐనవోలు 39, కాశీబుగ్గ 34, నెక్కొండ 33 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

ఎనుమాములకు పోటెత్తిన తెల్లబంగారం

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం తెల్లబంగారం పోటెత్తింది. సుమారు 10వేల పత్తి బస్తాలు మార్కెట్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో ఇంత మొత్తంలో పత్తి రావడం ఇదే తొలిసారన్నారు. పంట చేతికొస్తున్న తరుణంలో.. సోమవారం వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో.. దిగుబడులు ఎక్కువగా వచ్చినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్‌లో సోమవారం క్వింటా పత్తి గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.5,500 పలికింది. పాత పత్తికి క్వింటా రూ.7,520 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సారు.. కొంచెం సైడ్ ఇవ్వరూ!

–వరంగల్‌క్రైం, కాజీపేట, న్యూస్‌టుడే

పరిశీలన



అక్రమాలు తొలగిస్తే సరి

హనుమకొండ నక్కలగుట్ట వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించి పాదచారులు నడిచేలా చూడాలి.

కమిషనరేట్ పరిధిలో వాహనాల సంఖ్య ఇలా

కార్లు: 40945 / ద్విచక్ర వాహనాలు: 4,72,360

ఆటోలు: 32,150 / ఇతర: 1800

ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి నిత్యం 4 వేల నుంచి 5 వేల రాకపోకలు సాగిస్తాయి..



ఎవరి ఇష్టం వారిదే.. వరంగల్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదు. దీంతో ఎవరు ఇష్టం వచ్చినట్లు వారు వెళ్తున్నారు.

వరంగల్ నగరంలో.. కార్యాలయానికి వెళ్లే ఉద్యోగి గంట ముందే బయలుదేరుతున్నారు. విద్యార్థులు చివరి గంట కొట్టే వరకు వస్తూనే ఉంటారు.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు గమ్యస్థానం చేరుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతుంటారు.. కారణం ట్రాఫిక్ కష్టాలు. సోమవారం ఉదయం 'న్యూస్‌టుడే బృందం' నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను పరిశీలించింది.

పరిశీలన సమయం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు

నగరంలో అడుగడుగునా ట్రాఫిక్ చిక్కులు



పార్కింగ్ స్థలం ఉంటే మేలు..

హనుమకొండ చౌరస్తా నుంచి విజయ టాకీస్ వెళ్లే రోడ్డులో పార్కింగ్ స్థలం లేదు.. వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు.



అడ్డదిడ్డంగా ఆటోలు

వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సమీపంలో ఆటోలు వరుస క్రమంలో కాకుండా అడ్డదిడ్డంగా ఆపుతున్నారు. దీంతో ఇతర వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలి. – గిర్మాజీపేట

ఇవీ సమస్యలు..

☛ పోలీసు కమిషనరేట్ పరిధిలో రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. రహదారులను మాత్రం అందుకు తగ్గట్లు విస్తరించలేదు.

☛ కాజీపేట నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు ఒకే రోడ్డు ఉండడంతో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

☛ నగర విస్తీర్ణం, వాహనాల రద్దీ దృష్ట్యా 400 మంది వరకు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉండాలి.. 250 మంది మాత్రమే ఉంటున్నారు..

ట్రాఫిక్ నియమాలు పాటించాలి - ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

వాహనాల రద్దీకి తగ్గట్టుగా రహదారుల విస్తరణ లేదు. దీని వల్ల పలు ప్రాంతాల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి.



రహదారులను బాగు చేయాలి..

హనుమకొండ- కరీంనగర్ రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ రహదారులు ధ్వంసమయ్యాయి. ఎప్పటికప్పుడు బాగు చేయాలి..

❒ ఆటోలు వంతెన మీద నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ట్రాఫిక్ ఆగిపోతుంది.

❒ సిద్ధార్థనగర్ వద్ద పాదచారుల కోసం జీబ్రాక్రాసింగ్ లేకపోవడంతో వారు ఎక్కడ పడితే అక్కడ చిన్న పిల్లలను పట్టుకుని రోడ్డు దాటుతున్నారు.

❒ గ్యాబ్రియల్, బిషప్‌బరెట్టా పాఠశాలకు వెళ్లిన వాహనాలు తిరిగి ప్రభావతి ఆసుపత్రి రోడ్డు నుంచి తిరిగి రావాలి.. కొందరు దర్గా రోడ్ మీదుగా ఎదురుగా రావడం వల్ల అంతరాయం కలుగుతోంది.

❒ కాజీపేట డీమార్టు ముందు లారీలు ఎఫ్‌సీఐ వైపునకు మలుపు తిరుగుతుండగా వెనక వచ్చే వాహనాలు ఆగుతున్నాయి.

❒ మూడు పాఠశాలల సమయం ఒకే విధంగా ఉండటంతో పాఠశాలకు వచ్చే వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది.

❒ ఒక్క విద్యార్థిని దింపడానికి కూడా పాఠశాలలకు కార్లు తీసుకు రావడం వాహనాల సంఖ్య ఎక్కువ అవుతుంది.

అసంపూర్తి వంతెన పూర్తి చేస్తే మేలు

కాజీపేటలో అసంపూర్తిగా ఉన్న రైల్వే ఫ్లైఓవంతెన నిర్మాణం పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుంది.. నగరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ దిశగా కార్యాచరణ ప్రారంభించాలి.

కాజీపేట రైల్వే వంతెన వద్ద అస్తవ్యస్తం

కాజీపేటలో ఉన్న రైల్వే ఇరుకువంతెన పైన ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంది. కానిస్టేబుళ్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. సిద్ధార్థనగర్ వద్ద వంతెన కింది భాగాన మూడు పాఠశాలలు ఉండటంతో ఉదయం 8.30 నుంచి 9 గంటలకు వరకు ట్రాఫిక్ విపరీతంగా ఉంటుంది. పిల్లలను ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో పరిమితికి మించి తీసుకెళుతున్నారు. సిద్ధార్థనగర్ వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ వారిస్తున్నా.. సరైన సమయానికి విద్యార్థులను పాఠశాలకు చేర్చాలనే ఉద్దేశంతో మదర్ థెరిసా జంక్షన్ (చాకలి ఐలమ్మ జంక్షన్) వద్ద యూ టర్న్ తీసుకోవాల్సి ఉండగా.. సిద్ధార్థనగర్ వద్దే తీసుకుంటున్నారు. దీంతో కాజీపేట వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బంది కలుగుతోంది.

– కాజీపేట, న్యూస్‌టుడే



కాజీపేట ఇరుకు వంతెనపై ఎదురెదురుగా వాహనాలు..

అర్జీల వెల్లువ.. అక్రమాలే దండిగా..!

గ్రేటర్ ప్రజావాణికి 78 వినతులు



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని వివిధ కాలనీల్లో అంతర్గత రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా.. టౌన్‌ప్లానింగ్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు కమిషనర్ డా.అశ్విని తానాజీ దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి 78 ఫిర్యాదులు వచ్చాయి. అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 47, ఇంజినీరింగ్ 10, పన్నుల శాఖవి 8, ప్రజారోగ్యం 7, తాగునీటి సరఫరాలో సమస్యలపై 4, ఉద్యానవన విభాగానికి చెందినవి రెండు వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఆక్రమణలపై సత్వర చర్యలు చేపట్టాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. అన్ని విభాగాల పెండింగ్, పరిష్కారాలపై కమిషనర్ సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌ఓ డా.రాజిరెడ్డి, ఉప కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ ప్రాంతం: ☛ హనుమకొండ అదాలత్ కూడలిలో ఓ భవన నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. ☛ హనుమకొండ పోస్టల్ కాలనీలో 40 అడుగుల రహదారి ఆక్రమణకు గురవుతోంది. ☛ హనుమకొండ ప్రాంతంలోని పలు డివిజన్లలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి, ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉద్యోగులపై చర్యలు తీసుకోండి. ☛ 1వ డివిజన్ గుండ్ల సింగారంలో పందుల షెడ్డు తొలగించాలి. ☛ నయీంనగర్ ఇంటి నంబరు 5-11-251 దగ్గర డ్రైనేజీ లేకపోవడంతో మురుగు, వరదనీరు ఆగుతోంది చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు.

వరంగల్ ప్రాంతం: ☛ 29వ డివిజన్ ఎస్సీ కాలనీలో స్టాటిక్ ట్యాంకు రిపేర్ చేయించండి. ☛ ఎనుమాముల బాలాజీనగర్, రుద్ర కాలనీల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి. ☛ వరంగల్ పోతననగర్‌లో కిరోసిన్ అసోసియేషన్‌కు చెందిన స్థలంలో భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వొద్దని విన్నవించారు. ☛ వరంగల్ ప్రాంతం బందెలశెట్టి గల్లీలో వీధిదీపాలు వెలగడం లేదు. 42వ డివిజన్ రంగశాయిపేట బీరన్నగుడి దారిలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలి. ☛ వరంగల్ బట్టలబజారు ఆర్వోబీ పైన ఏర్పడిన గుంతలు పూడ్చాలని అర్జీదారులు కోరారు.

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. జిల్లా పాలనాధికారి డా.సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణితో కలిసి 118 వినతులు స్వీకరించారు. ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని పాలనాధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వచ్చిన మొత్తం అర్జీల్లో 62 భూ సంబంధిత సమస్యలే ఉన్నాయి. జిల్లా వ్యవసాయశాఖ 9, ఉపాధికల్పనశాఖ 6, మిగిలిన అర్జీల్లో వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద



డయాలసిస్ కేంద్రంలో నీటికొరత..

వరంగల్ కేఎంసీ మల్టీస్పెషల్ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నాం. సుమారు 120 మందికి వారానికి మూడుసార్లు డయాలసిస్ అవసరం. నీటి కొరత కారణంగా.. సకాలంలో సేవలందడం లేదు. దీంతో ఆయాసం, బీపీ పెరగడం తదితర సమస్యలతో సతమతమవుతున్నాం. నీటికొరత సమస్యను పరిష్కరించి, డయాలసిస్ సమయంలో ఉచిత భోజన, మందుల సదుపాయం కల్పించాలని బాధితులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు.



వ్యాపారులపై చర్యలు తీసుకోండి

మేము ఖానాపురం మండలం ధర్మారావుపేటకు చెందిన రైతులం. వర్షాకాలం సాగు కోసం అదే గ్రామంలోని యుగంధర్, కల్పన ఫెర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేశాం. కల్తీ విత్తనాల వల్ల 40శాతం పంట నిర్ణీత సమయం కన్నా ముందే ఎదిగి ఎర్రబడింది. మిగతా పంట ఇంకా పొట్టదశలోనే ఉంది. అసలు పంట చేతికొచ్చే సమయానికి ముందుగా వచ్చింది నేలపాలై.. తీవ్రనష్టం జరుగుతుంది. నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణ యజమానులపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు.

నగదు కాజేసిన బ్యాంకు మిత్రపై ఫిర్యాదు

నర్సంపేట, న్యూస్‌టుడే: నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్‌లోని బిజినెస్ కరస్పాండెంట్ కేంద్రం నిర్వాహకుడు (బ్యాంకు మిత్ర) కొందరు ఖాతాదారుల బ్యాంకు ఖాతాల నుంచి నగదు కాజేసినట్లు తెలిసింది. ఈ మేరకు గ్రామానికి చెందిన ధనమ్మ రెండురోజుల క్రితం నల్లబెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఖాతాలో ఎంత నగదు ఉందో తెలుసుకునేందుకు వెళ్లగా.. నిర్వాహకుడు తన వేలిముద్ర వేయించుకొని వివరాలు చెప్పారని, తర్వాత తనకు తెలియకుండా రూ.25వేల చొప్పున మూడు సార్లు నగదు డ్రా చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరి ఖాతాల నుంచి రూ.50 వేల చొప్పున కాజేసినట్లు సమాచారం. ఈ ఘటనపై ఓ మహిళ ఫిర్యాదు చేసిందని సీఐ సాయి రమణ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు నా క్లయింట్ అయినా **చైతన్య ఎమర్జింగ్స్ హైదరాబాద్** గారు తెలియజేయునది ఏమనగా వరంగల్ పట్టణము, ఖిలా వరంగల్ మండలము మరియు గ్రామములోని సర్వే నెంబర్ 1680, 1693 పాతవి 1210, 1200 కొత్తవి దీనిలో గల ఇంటి నెంబర్లు 16-3-1005, 16-3-1006, 16-3-1009, 16-3-1010 మరియు 16-3-1011 గల గోడౌన్ మరియు ఖాళీ స్థలం 13805 చదరపు గజముల స్థలమును అనగా ఇందు షెడ్యూల్ దాఖల ఆస్తి అపార్ట్‌మెంట్‌గా అభివృద్ధి చేయుటకు గాను నా క్లయింట్ వరంగల్ పట్టణం శివనగర్ నివాసులైన **మండలపు రామయ్య, మండలపు పిచ్చమ్మ, మండలపు కోటేశ్వర్‌రావు, మండలపు లక్ష్మణ్‌రావు, మండలపు సూర్యనారాయణరావు, ముచ్చ వెంకట్రావమ్మ, చంద్ర భూలక్ష్మి, చదలవాడ కోటీశ్వరి, యార్లగడ్డ రాణి** మరియు **ఆకుల నాగరాజు** గార్లతో రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెంబర్లు 58/2019, 59/2019, 9009/2019, 10957/2019 మరియు 5746/2020 పొంది ఉంటిరి అవి అన్నియూ కూడా సబ్ రిజిస్టర్ ఫోర్టు వరంగల్ వద్ద రిజిస్టర్ కాబడినవి ఆ రోజు నుండి షెడ్యూల్ దాఖల ఆస్తి రిజిస్టర్ దస్తావేజుల ద్వారా నా క్లయింట్‌కు రిజిస్ట్రేషన్ కలవు. కానీ కొందరు వ్యక్తులు నా యొక్క క్లయింట్ యొక్క ప్రమేయము లేకుండా ఇతరులకు అమ్ముటకు లేదా ఇతరత్రా లావాదేవీలు చేయుటకు గాను ప్రయత్నాలు చేయుచున్నారని నా క్లయింట్ విశ్వసనీయంగా తెలియవచ్చినది. కావున ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఎవరు కూడా ఎలాంటి లావాదేవీలు చేయకూడదని చేసిన చెల్లనేరవని మరియు నా క్లయింట్ తీసుకోబోవు చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని ఇందుమూలముగా హెచ్చరించనైనది.

షెడ్యూల్ ఏ: వరంగల్ పట్టణంలో గల ఖమ్మం రోడ్డు వైపున ఉన్నటువంటి విద్యానగర్ కాలనీలోని సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాత సర్వేనెంబర్ 1683 మరియు 1693 ఇంటి స్థలము గోడౌన్ భవనము ఇంటి నెంబర్ 16-3-1006లో 3000 చదరపు గజముల స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** అంకల రామచంద్రరావు మరియు పి.మల్లేశం గారి ఇంటి స్థలము, **పడమర:** ఎం.లక్ష్మణరావు గారి గోడౌన్ స్థలము, **ఉత్తరము:** భాస్కరాచారి మరియు మాధవాచారి గార్ల ఇల్లు, **దక్షిణం:** ఎం.కోటేశ్వరరావు గారి గోడౌన్ మరియు ఉమ్మడి దారి.

షెడ్యూల్ బి: వరంగల్ పట్టణంలోని ఫోర్టు వరంగల్‌లో గల సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాతవి 1683 మరియు 1693లలో గల గోడౌన్ మరియు ఖాళీ స్థలం ఇంటి నెంబర్ 16/360/డి పాతవి 16-3-1010 కొత్తదిలో గల 3506.77 చదరపు గజములు స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** ఎం.కోటేశ్వర్‌రావు గారి గోడౌన్, **పడమర:** ఇతరుల ఖాళీ స్థలము, **ఉత్తరము:** రోడ్డుకు చేరు ఉమ్మడి దారి, **దక్షిణం:** ఉమ్మడి దారి తర్వాత ఇతరుల స్థలము.

షెడ్యూల్ సి: వరంగల్ పట్టణంలో గల ఖమ్మం రోడ్డు వైపున ఉన్నటువంటి విద్యానగర్ కాలనీలోని గోడౌను బిల్డింగు ఇంటి నెంబర్ 16-3-1009, సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాత సర్వేనెంబర్ 1683 మరియు 1693 ఇంటి స్థలములోని 3552 చదరపు గజముల స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** ఎం.సూర్యనారాయణరావు గారి గోడౌన్, **పడమర:** రామగిరి వినయ్‌కుమార్ మరియు ఆర్.బిక్షపతి గార్ల ఖాళీ స్థలం, **ఉత్తరము:** పుప్పాల రవీందర్ మరియు తడక రవి గార్ల ఇల్లులు, **దక్షిణం:** 30 ఫీట్ల ఉమ్మడి దారి.

షెడ్యూల్ డి: వరంగల్ పట్టణంలోని ఫోర్టు వరంగల్‌లో గల సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాతవి 1683 మరియు 1693లలో గల గోడౌన్ మరియు ఖాళీ స్థలం ఇంటి నెంబర్ 16-3-1005లో గల 3077 చదరపు గజములు స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** పిచ్చమ్మ గారి ఇల్లు ఇంటి నెంబర్ 16-3-1011, **పడమర:** వెంకటరామయ్య మరియు ఇతరుల ఇంటి నెంబర్ 16-3-1010 గల గోడౌన్, **ఉత్తరము:** ఉమ్మడి దారి తరువాత సూర్యనారాయణ గారి యొక్క గోడౌన్ ఇంటి నెంబర్ 16-3-1006, **దక్షిణం:** కె.సునీత మరియు ఇతరుల ఇంటి నెంబర్ 16-3-1014/బి గల ఇల్లు.

షెడ్యూల్ ఇ: వరంగల్ పట్టణంలో గల ఖమ్మం రోడ్డు వైపున ఉన్నటువంటి విద్యానగర్ కాలనీలోని ఇల్లు మరియు ఇంటి స్థలం, ఇంటి నెంబర్ 16-3-1011, సర్వే నెంబర్ 1200 మరియు 1210 పాత సర్వేనెంబర్ 1683 మరియు 1693 ఇంటి స్థలములోని 669.08 చదరపు గజముల స్థలము ఈ దిగువ హద్దులతో కలదు. **తూర్పు:** 100 ఫీట్ల ఖమ్మం రోడ్డు, **పడమర:** ఎం.కోటేశ్వర్‌రావు గారి గోడౌన్, **ఉత్తరము:** రోడ్డుకు వెళ్ళు ఉమ్మడి దారి, **దక్షిణం:** ఇతరుల ఇల్లు.

తేది: 19-10-2024

ఇట్లు సం/- పద్మ అరవింద్, B.Sc., LL.B., అడ్వకేట్

H.No. 8-11-180, P.N.B. Lane, J.P.N. Road, Warangal, Cell: 9849152264

రైతేరాజు వివరాలు 6లో..

అమ్మ కోసం.. సాంకేతిక బాట

గుర్తుకొస్తున్నారు..!



దుగ్గొండి మండలం నాచినపల్లి(1986) వద్ద జరిగిన కాల్పుల్లో చనిపోయిన వెంకట్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఆయన భార్య రాధ.

విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టి అమరులైన పోలీసులను స్మరించుకునేందుకు హనుమకొండలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమరవీరుల దినోత్సవం సందర్భంగా అక్కడ స్తూపం వద్ద అమరులైన కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కొన్ని కుటుంబాల వారు నాటి ఘటన గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

– ఈనాడు, హనుమకొండ



1999లో హంటర్ రోడ్‌లో జరిగిన నక్సల్స్ కాల్పుల్లో చనిపోయిన శ్రీనివాస్‌రెడ్డిని గుర్తు చేసుకుంటూ ఆయన చిత్రపటాన్ని తుడుస్తున్న భార్య శిరోమణి, పక్కన మనుమరాలు మహిజ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో 1999లో పోలీసులు, నక్సల్స్ మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో చనిపోయిన వహీద్‌ఖాన్‌కు నివాళులర్పిస్తున్న ఆయన మనుమరాలు, సమీప బంధువు



విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ డా.బైరి ప్రభాకర్

టీజీ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

మట్టెవాడ, న్యూస్‌టుడే: టీజీ ఎప్‌సెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. సోమవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియకు 423 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్(బైపీసీ) పూర్తి చేసి, టీజీ ఎప్‌సెట్‌కు అర్హత సాధించిన విద్యార్థులు బీఫార్మసీ, ఫామ్ డీ, ఫార్మాసుటికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చున్నారు. ఈ నెల 23 వరకు ధ్రువపత్రాల స్లాట్ ఎంచుకోవచ్చని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. సీట్ అలాట్‌మెంట్ 28న జరుగుతుందని, ఈ నెల 30న ప్రవేశం పొందిన కళాశాలలో చేరాలని సూచించారు.

విరులు.. లాభాల సిరులు



నర్సంపేట, ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : బంతి పూల సాగు లాభదాయకంగా ఉండటంతో పలువురు రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు.. స్వల్ప పెట్టుబడి.. తెగుళ్లు, చీడపీడల బాధలు తక్కువే.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లిలో ఎడ రమేశ్ ఎకరం భూమిలో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్‌లో రైతు అంబాల కరుణాకర్ ఎకరంలో బంతి సాగు చేశారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతోంది. రమేశ్ తన మిత్రుడి సాయంతో గత జులైలో ఈస్ట్‌వెస్ట్ కంపెనీకి చెందిన బంతి విత్తనాన్ని బెంగళూరు నుంచి తెప్పించి నారు పోసినట్లు తెలిపారు. నారు పోసిన 25 రోజుల తర్వాత మొక్కలు నాటారు. అంతరకృషి, మొక్కలకు ఎరువులు వేశారు. 52 రోజులకు రెక్కల పురుగు నివారణకు పురుగు పిచికారీ చేశారు. పూలు మొత్తం నాలుగు కోతలు వస్తాయి. మొదటి కోత తొలి బతుకమ్మ(అమావాస్య)కు కోయగా దిగుబడి టన్నున్నర వచ్చింది. కిలో రూ.80 ధర పలికింది. సద్దుల బతుకమ్మకు రెండో కోత మూడు టన్నుల దిగుబడి రాగా, ధర రూ.60-70 వరకు ధర పలికింది. ఈ రెండు విడతలో దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు రమేశ్ వివరించారు.

ఆదర్శం



తోటలో పనులు చేస్తున్న రమేశ్ దంపతులు

రూ.2.5 లక్షలు వస్తాయని అంచనా..
-అంబాల కరుణాకర్, రైతు



రెండేళ్ల నుంచి బంతి సాగు చేస్తున్నాను. సుమారు రూ.3 లక్షల ఆదాయం వస్తుందని అంచనా.. పెట్టుబడి రూ.50వేలు పోగా రూ.2.5 లక్షలు చేతికి వస్తాయి..

ప్రశ్న- సమాధానం

? పత్తి పంటలో ఆకులు నల్లగా మారుతున్నాయి. ఎండిపోయి రాలుతున్నాయి. నివారణ చర్యలు తెలపండి..? **-రైతు, రావుల లక్ష్మయ్య, సూధన్‌పల్లి.**

✔ బ్యాక్టీరియాతో ఆకులు నల్లగా మారుతున్నాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ రెండు గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను నేల ద్వారా మొక్కలకు అందించాలి. పైపాటుగా లీటరు నీటికి 10 గ్రాముల యూరియా స్థూల పోషకాల మిశ్రమాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
-డా.రాజు, శాస్త్రవేత్త, కేవీకే వరంగల్
-వరంగల్ వ్యవసాయం



రైతేరాజు

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్!



పాకాల ఆయకట్టులో సాగవుతున్న సన్నవరి

ఖానాపురం, గోపాలపూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. అయితే, ఏయే రకాలకు బోనస్ ఇస్తారో తెలియక అన్నదాతలు అయోమయంలో ఉన్నారు. ఇటీవల ఆయా రకాల జాబితాను వ్యవసాయ శాఖకు ప్రభుత్వం విడుదల చేసింది. 33 రకాల సన్నాల వరికి బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించారని వ్యవసాయాధికారి భోగ శ్రీనివాస్ 'రైతేరాజు'కు తెలిపారు. సిద్ది(డబ్ల్యూజీఎల్44), కేపీఎస్ 2874(కంపాసాగర్ వరి-1), సాంబమశూరి, జగిత్యాల వరి-3, జగిత్యాల వరి-2, వరంగల్ సాంబ(వరంగల్ 14), వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ(జేజీఎల్384), క్రిష్ణ(ఆర్ఎన్నార్2458), మానేరు సోన, తెలంగాణ సోన(ఆర్ఎన్నార్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2, వరంగల్ వరి-2, రాజేంద్రనగర్ వరి-4, కూనారం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, అంజన(జేజీఎల్ 1118), నెల్లూరు మసూరి, ప్రద్యుమ్న, సుగంధ సాంబ, శోభిని, సోమనార్, ఆర్ఎన్నార్, కేపీఎస్ 6261, జేసీఎల్ 33124, హెచ్ఎంటీ సోన, మారుతేరు సాంబ, మార్టేరు మసూరి, ఎంటీయూ 1271 రకాల జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు సన్నాలుగా ఉండి 6 మి.మీ పొడవు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉన్న పరిమాణాన్ని పరిగణలోకి తీసుకుని సన్నరకాలుగా గుర్తించి బోనస్ చెల్లిస్తారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా వ్యవసాయాధికారులు వెర్నియర్‌కాలిఫర్ సూక్ష్మ కొలతలు గణించి ప్రతి వడ్ల కుప్పను పరిశీలించి నిర్ధారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ రైతు పండించిన పంట మొత్తానికి బోనస్ ఇస్తారా..? రైతు భరోసా వలె కటాఫ్ ఎకరాలకు ఇస్తారో ఇంకా నిర్ధారించలేదు.
-న్యూస్‌టుడే వరంగల్ వ్యవసాయం

రైతుకు భరోసా.. మాన్‌ధన్ యోజన



కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పై బడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. గరిష్ఠంగా రెండు హెక్టార్లు(5 ఎకరాలు)లోపు సాగు భూమి ఉండి 18-40 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు. అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు ఇతర వృత్తి నిపుణులు దీనికి అనర్హులు. ఆదాయ పన్ను చెల్లిస్తున్నవారు, నిర్దేశించిన దాని కంటే అధిక రాబడి పొందుతున్నవారు, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందినవారు కూడా పథకంలో చేరడానికి వీల్లేదు. రైతులు కామన్ సర్వీసు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. ఫొటో, నివాస, ఆధార్, ధ్రువీకరణ, వయసు నిర్ధారణ, సాగు భూమి పత్రాలు, ఆధార్ కార్డు సమర్పించాలి. పీఎంకేఎం పోర్టల్‌లో నమోదు చేశాక చరవాణి నంబరుకు సందేశం వస్తుంది. ప్రత్యేకంగా పింఛను ఖాతా తెరిచి కార్డు ఇస్తారు. ఇందుకైన ఖర్చు రూ.30లను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

వయసు ఆధారంగా ప్రీమియం : పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వారు నెలకు రూ.55 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్లకు పైబడిన వారు రూ.200 చెల్లించాలి. ఇంతే మొత్తం ప్రభుత్వమూ చెల్లిస్తుంది. 60 ఏళ్లు వచ్చే వరకు ప్రీమియం కట్టాలి. ఆ తర్వాత ప్రతి నెల రూ.3 వేల చొప్పున పింఛను వస్తుంది. ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకేసారి అందజేస్తారు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే.. -కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట
లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

షట్లర్ శ్రీచేతన్‌శౌర్యకు రెండో ర్యాంకు



వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సబ్ జూనియర్(అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారుడు శ్రీచేతన్‌శౌర్య తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. బాలుర డబుల్స్ విభాగంలో 2వ స్థానంలో, సింగిల్స్‌లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన పలు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించి.. వ్యక్తిగత ర్యాంకింగ్‌లో దూసుకెళ్లాడు. హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన శ్రీచేతన్‌శౌర్య ఆటతీరు అభినందనీయమని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రమేష్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు డా. రమేష్‌కుమార్, నాగకిషన్ పేర్కొన్నారు.

అమ్మ కోసం.. సాంకేతిక బాట

యాప్‌పై శిక్షణకు శ్రీకారం

అమ్మ కోసం యాప్‌ను అమలు చేయడానికి ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇటీవల ప్రారంభించారు.
-న్యూస్‌టుడే, డోర్నకల్

ఇంట్లో కూతురు/కోడలు గర్భం దాల్చితే వారి బాగుగోలను పెద్దవాళ్లు చూసుకుంటారు. ఇప్పుడిక ట్రెండ్ మారుతోంది. రానున్న రోజుల్లో ఆధునికత చేదోడు కానుంది. సాంకేతిక బాట పట్టిన గర్భ సంరక్షణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. నేషనల్ హెల్త్ మిషన్, యునిసెఫ్ భాగస్వామ్యంతో అర్మన్ అనే స్వచ్ఛంద సంస్థ రూపకల్పన చేసిన 'అమ్మ కోసం' యాప్ ప్రయోజనకరంగా మారనుంది. ఇది గర్భిణులు, బాలింతలు, పిల్లల శ్రేయస్సుకు దోహదపడుతుంది.

ఆరోగ్య కల సాకారం

అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఇమిడి ఉంది. దైనందిన జీవితంలో ఒకటిగా మారింది. ఇప్పుడు 'అమ్మ-కోసం' యాప్ పురుడు పోసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్య సంబంధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చే ప్రధాన వనరుగా మారింది. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం ఎలా? పిండం ఎదుగుదలను పర్యవేక్షించడం ఎలా?.. తదితర అంశాలను తెలుసుకునే వీలుంది. లోపాలుంటూ వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో అమ్మ-కోసం యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవసరమైన అనుమతులు అంగీకరించాక లాగిన్ ప్రక్రియని కొనసాగించాలి.
☛ యూజర్ నేమ్, పాస్‌వర్డు నమోదు చేసి 'రిమెంబర్ మీ' చెక్‌బాక్స్ మీద నొక్కాలి.
☛ తెరపై ఐహెచ్ఆర్‌పీటీఎం పేరిట 'డ్యాష్‌బోర్డు' కనిపిస్తుంది.
☛ బ్యాక్ గ్రౌండ్‌లో చూపిన విధంగా ఆఫ్‌లైన్‌లో ఉపయోగించుకునేందుకు అన్ని కోర్సు-లెసన్ ఫైళ్లని సైతం డౌన్‌లోడ్ చేస్తుంది. ఒకవేళ ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ కాని పక్షంలో 'సింక్ ఐకాన్‌'పై క్లిక్ చేస్తే డౌన్‌లోడ్ అవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..



☛ లెర్నింగ్ మేనేజ్‌మెంటు సిస్టం(ఎల్ఎంఎస్) ద్వారా పీడీఎఫ్, వీడియో, ఆడియో, ఇమేజ్ వివిధ ఫార్మాట్లలో కోర్సు పాఠాల వీక్షణకు ఇది వీలు కల్పిస్తుంది.
☛ కోర్సు లెసన్ ఫైళ్లలోకి వెళితే.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న వాటితో పాటు ప్రారంభించని కోర్సుల జాబితా కనిపిస్తుంది. చిట్కాలు అందిస్తుంది
☛ ప్రసవానికి ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయామాలను ఇది సూచిస్తుంది
☛ మంచి పోషణకు ఆహారాన్ని తీసుకోవడంలో తోడుంటుంది
☛ బాలింతలకు అవసరమైన సూచనలు చేస్తుంది
☛ పిల్లల విషయంలో జాగ్రత్తలను తెలుపుతుంది.

ఉమ్మడి జిల్లా స్వరూపం

జిల్లా	గర్భిణులు	బాలింతలు	పిల్లలు
మహబూబాబాద్	4930	3943	44837
జయశంకర్ భూపాలపల్లి	2653	2431	24476
హనుమకొండ	4231	3987	45552
వరంగల్	6128	6432	50423
జనగామ	3396	2430	23643
ములుగు	2874	2497	21624

గర్భిణులకు మేలు
- డా.మధుసూదన్, జిల్లా వైద్యాధికారి, శ్రీదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

అమ్మ-కోసం యాప్ గర్భిణులకు ఒక కల్పతరువు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో గర్భస్థ సమయంలో కొవిడ్, రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవ పూర్వ రక్తస్రావం, మధుమేహం, గత సిజేరియన్ స్థితి, పిండం ఎదుగుదల ముఖ్యమైనవి. యాప్‌ను ఏఎన్ఎంల ట్యాబ్‌లలో డౌన్‌లోడ్ చేశారు. పదిహేను రోజులకు ఒకసారి ఒక్కో అంశంపై వీరికి ఒక లింక్‌ను ఆడియో/వీడియో రూపంలో పంపిస్తారు.

తెలుగులో సులభంగా అర్థం అవుతుంది
- సీహెచ్ స్వప్న, ఏఎన్ఎం, భూపాలపల్లి



అమ్మ కోసం యాప్ తెలుగులో ఉండటంతో సులభంగా అర్థమవుతోంది. శిక్షణలో గర్భిణులు, వారు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, చికిత్సకి సంబంధించిన అంశాలను వివరించారు.



భూపాలపల్లిలో శిక్షణకు హాజరైన ఏఎన్ఎంలు

'కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలి'

జనగామ, న్యూస్‌టుడే: 'కల్వకుంట్ల కుటుంబానికి నిజాయతీ ఉంటే, 2014లో మీ ఆస్తులు ఎన్ని, ఇపుడెన్ని? అనే వివరాలను ప్రకటించాలని' మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, సంతోష్, హరీశ్‌రావులు అధికార కూటమిగా మారి దోపిడీ చేశారని ఆరోపించారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా విపణిలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్న సభలో శ్రీహరి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో కమిషన్ల కోసం పనులు తప్ప, అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రస్తుతం సమస్యలు పేరుకున్నాయని విమర్శించారు. తాను భారాసలో ఉన్నప్పుడు విద్య, ఉపాధిపై సమీక్షకు గంట సమయం ఇవ్వలేదని, ప్రజా సమస్యలపై మాట్లాడితే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. డీఎస్సీ ప్రక్రియను ఆరు మాసాల్లో విజయవంతంగా పూర్తి చేసి 11 వేల కుటుంబాల్లో సీఎం వెలుగులు నింపారన్నారు. భాజపా నాయకత్వం ఆధిపత్యం కోసం కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల పోటీపడుతున్నారన్నారు. మూసీ, హైడ్రా విషయంలో వారి మాటల్లో పొంతనలేదని, ఒక్కనాడైనా కలిసి ఈ అంశాలపై స్పష్టతనిచ్చారా? అని ప్రశ్నించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్ప బలంతో ముందుకు వెళ్తోందని వివరించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం : వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ ప్రతినిధి కన్నా తెలిపారు. హనుమకొండలోని తితిదే వేడుకల మందిరంలో అండర్-15 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బాలబాలికలు తమిళనాడులో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని చెప్పారు.

డమ్మీ తుపాకితో బెదిరించిన దుండగుడికి దేహశుద్ధి



నిందితుడు

దామెర, న్యూస్‌టుడే: డబ్బులివ్వాలని డమ్మీ తుపాకితో కిరాణ దుకాణ యజమానిని బెదిరించిన వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండకు చెందిన సంపత్ జాతీయరహదారి పక్కన కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుకాణం షట్టర్‌ను తట్టి బిస్కెట్ ప్యాకెట్ కావాలని కోరాడు. దీంతో సంపత్ షట్టర్ తెరవగానే.. దుండగుడు డమ్మీ తుపాకి చూపించి డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవంటూ సంపత్ భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంపత్ తెలిపారు. దుండగుడు గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని విచారిస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

పాఠశాలల్లో సార్వత్రిక ప్రవేశాలు షురూ!

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ మధ్యకోట ఆర్జేడీ బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మూరాల శంకరరావు తెలిపారు. సోమవారం ప్రవేశాల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు పాఠశాలల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ 96034 86850 సంప్రదించాలన్నారు.

ప్రజాసేవలో పోలీసులు ముందుంటారు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాసేవలో పోలీసులు ముందుంటారని అమరుల ఆశయ సాధనకు పనిచేస్తూ విధుల్లో రాణించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్‌డే) నిర్వహించారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మృతి చెందిన 241 మంది పోలీసు అమరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, కర్నల్ రవికుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్‌తో పాటు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు సిబ్బంది అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సాయుధ పోలీసుల శోక్‌శస్త్ర చేసి మరణించిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు త్యాగధనులన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు పనిచేయాలన్నారు. నీతి నిజాయతీతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. అమరవీరులు ఎల్లప్పుడూ మన గుండెల్లోనే ఉంటారన్నారు. వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారికి ఎలాంటి సమస్యలున్నా పోలీసు విభాగం తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం కమిషరనేట్ నుంచి హనుమకొండ మిషన్ ఆసుపత్రి వరకు పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు కలిసి ప్రదర్శన నిర్వహించారు. పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని పోలీసు అమరులకు జోహార్లు అర్పించారు.



అమరవీరుల స్తూపం అలంకరణ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా. చిత్రంలో పై వరుస(ఎడమ నుండి కుడికి) హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావిణ్య, సత్య శారద, ఎన్‌సీసీ కమాండెంట్ కర్నల్ రవీంద్ర కుమార్ రవి, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్. కింది వరస పోలీసు ఉన్నతాధికారులు రవి, మధుసూదన్, నందిరాం నాయక్, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి



స్మృతి పరేడ్‌లో పోలీసుల నివాళి

నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటా

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసి, మృతి చెందిన లకావత్ శ్రీను కుటుంబ సభ్యులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పరామర్శించారు. పాలకుర్తి మండలం మేకలతండాలోని శ్రీను నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. శ్రీను మృతి ప్రభుత్వ హత్య అని అభివర్ణించారు. గిరిజన బిడ్డ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వివరించారు. కాంగ్రెస్ నేత యాకాంతరావు ప్రమేయం ఈ ఘటనలో ఉందని తెలిసిందని, పోలీసులు ఉన్నా, అందరికీ శిక్ష పడేలా సీపీ, డీసీపీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, నాయకులకు ఒత్తాసు పలకడం సరికాదని అసహనం వ్యక్త చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, భాజపా జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రెడ్డి, తండావాసులు గాంధీ నాయక్, సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, చిత్రంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, తదితరులు

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

ఎనుమాముల మార్కెట్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి.. గరిష్ఠ ధరను పొందాలన్నారు. తేమ వల్ల రైతులు నష్టపోకుండా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తొలివిడతలో వరంగల్ జిల్లాలోని 14 కేంద్రాల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభించామని వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద పేర్కొన్నారు. మిగతా చోట్ల త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ డిప్యూటీ మేనేజర్ అర్జున్ దవే, జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా.సత్యశారద తదితరులు

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

నర్సంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు దోహదపడతాయని నర్సంపేటలోని విజ్‌డమ్ పాఠశాల కరస్పాండెంట్ జావిద్ అన్నారు. 'ఈనాడు-ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో సోమవారం విజ్‌డమ్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థి ఎం.అన్వేశ్, తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్కే అర్మన్‌షా, 8వ తరగతి విద్యార్థిని హబీబుమిసా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు జావిద్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు రాము, రవీందర్ పాల్గొన్నారు.



నర్సంపేటలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో పాఠశాల కరస్పాండెంట్ జావిద్, ఉపాధ్యాయులు

రాయితీ బియ్యం స్వాధీనం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. గీసుగొండ ఠాణా పరిధిలోని శ్రీపౌల్ట్రీ ఫాంలో అక్రమంగా రూ.28,750 విలువ చేసే 12.4 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. బియ్యం స్వాధీనం చేసుకొని యజమాని రాజేంద్రప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. విచారణకు గీసుగొండ పోలీసులకు అప్పగించారు.

దేవుడి మాన్యం.. ధరణిలో నిక్షిప్తం

రామన్నపేట(వరంగల్), న్యూస్‌టుడే



దేవుడి మాన్యాలు, ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ నడుం బిగించింది. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ఆధునిక, సాంకేతిక పద్ధతులు అవలంబిస్తోంది. గూగుల్ సహకారంతో దేవాలయాలు, భూములను జియో ట్యాగింగ్ చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 34,092 ఎకరాల భూములకు జియో ట్యాగింగ్ పూర్తయ్యింది. వీటిలో 57 శాతం ఆలయాల భూములను ధరణిలో నిక్షిప్తం చేశారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాను సారం వరంగల్ ఉమ్మడి జిల్లాలో దేవాలయాలు, భూముల జియో ట్యాగింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.




ములుగు జిల్లా మల్లూరు శ్రీలక్ష్మీనర్సింహస్వామి గుడి

☛ జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో దేవాదాయ శాఖ డివిజనల్ పరిశీలకులు, కార్యనిర్వహణ అధికారులు, ఉద్యోగులు రంగంలోకి దిగారు. ఇప్పటికే 1,062 వరకు ట్యాగింగ్ పూర్తయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే ఈ ప్రక్రియలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముందంజలో ఉంది.

☛ దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలు, ధూపదీప నైవేద్యాల పథకం(డీడీఎన్) కింద ఎంపికైన దేవాలయాలు, వాటికి సంబంధించిన భూములు, ఆస్తులు, ధర్మ సత్రాలు ఇతర వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలు తీసి గూగుల్ సహకారంతో జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

☛ దేవస్థానం, దేవుడి, ఇతర విశిష్టత కలిగిన ఫొటోలు, ఆలయం పేరు, చిరునామా ఇతర వివరాలు క్షేత్రస్థాయి నుంచి అప్‌లోడ్ చేస్తున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరాలయం

ఎలా అరికడతారంటే..!

దేవాలయాల భూములు, ఇతర ఆస్తులు జియో ట్యాగింగ్ చేయడం వల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది. స్థలం వివరాలు, సరిహద్దులు, దేవస్థానం పేరు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. జియోట్యాగ్ చేసిన ఆలయాల భూములు, స్థలాల డేటాను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానం చేస్తారు. దీంతో అక్రమ రిజిస్ట్రేషన్లకు ఆస్కారం ఉండదు. జియో ట్యాగింగ్‌తో పాటు జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కొందరు నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం.

- రామల సునీత, ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల భూములు, స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఇందులో భాగంగానే మొదటి దశలో జియో ట్యాగింగ్ చేసి, రెండో దశలో భూముల వివరాలన్నీ ధరణిలో నిక్షిప్తం చేస్తున్నాం. మిగిలినవి వారం నుంచి పది రోజుల్లో పూర్తి చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సంపేట: 99635 59929
కార్పొరేషన్: 98484 09191
వర్ధన్నపేట: 99896 42307
వరంగల్ ఈస్ట్: 97053 46535
(10 AM TO 1 PM)

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలోని మినీ స్టేడియంలో ప్రహరీ వెనుక భాగంలో విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో క్రీడాకారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- నగేశ్, నర్సంపేట**

సమాధానం: స్టేడియంలో కొత్త విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేస్తాం. **- రాజేశ్, పుర ఏఈ, నర్సంపేట**

సమస్య: నర్సంపేట 15వ వార్డు పరిధిలోని మురుగుకాల్వలో పూడిక మట్టి పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచి దుర్గంధం వస్తోంది. **- అనిల్, నర్సంపేట**

సమాధానం: మురుగుకాల్వను శుభ్రం చేయిస్తాం

- నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నర్సంపేట

గడ్డి మందు పిచికారీ

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలోని సాయినగర్ వీధిలో మురుగుకాలువ పక్కన పిచ్చిగడ్డి పెరగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. కార్మికులతో గడ్డి మందు పిచికారీ చేయించారు. దీంతో గడ్డి ఎండిపోయి పరిసరాలు పరిశుభ్రంగా మారాయి.

చెట్ల తీగల తొలగింపు

స్పందనకు వందనం

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: చెన్నారావుపేట మండలం పాత ముగ్ధుంపురం శివారులో విద్యుత్తు తీగలను పిచ్చిచెట్ల తీగలు అల్లుకున్నాయి. ఈ విషయాన్ని విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా చెట్ల తీగలను తొలగింపచేయించారు. విద్యుత్తు తీగలు ఒకదానికొకటి తగలకుండా స్పేషర్స్ ఏర్పాటు చేశారు.

నర్సంపేట: నర్సంపేట- ఖానాపురం మార్గంలో పాత పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి పక్కన చెత్తా చెదారం పేరుకుపోయింది. దీనిపై 'అపరిశుభ్రంగా పరిసరాలు' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మున్సిపాల్టీ అధికారులు స్పందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కార్మికులతో చెత్తను తొలగింపజేయించారు.

మురుగుకాల్వ శుభ్రం

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండలోని యూనియన్ బ్యాంకు సమీపంలో మురుగుకాల్వలో చెత్తచెదారం పేరుకుపోయింది. సోమవారం భారీ వర్షం కురవడంతో సమీపంలోని ఇళ్లలోకి మురుగునీరు చేరింది. ఈ విషయాన్ని కారోబార్ ఎండీ.అలీ దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ సిబ్బందితో మురుగుకాల్వను శుభ్రం చేయించారు.

గీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: కల్లు గీత కార్మికుల ప్రాణాలకు 'అభయహస్తం' అందించేందుకే.. రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తోందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సోమవారం ఆమె ఎనుమాముల మార్కెట్ యార్డులో కలెక్టర్ డా.సత్యశారదతో కలిసి గీత కార్మికులకు కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు. తాటిచెట్టు నుంచి జారిపడి ఏ ఒక్క గీత కార్మికుడు ప్రాణాలు కోల్పోకుండా.. 6 పరికరాలతో రక్షణ కవచాన్ని ప్రభుత్వం తయారు చేసిందన్నారు. జిల్లాలో రూ.55 లక్షల వ్యయంతో 550 మంది గీత కార్మికులకు కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. తూర్పు నియోజకవర్గంలోని 116 మందికి అందించామన్నారు. అంతకుముందు ఓ గీత కార్మికుడు రక్షణ కవచాన్ని ధరించి మార్కెట్‌లోని ఓ తాటిచెట్టును ఎక్కిన తీరును మంత్రి పరిశీలించారు. బీసీ అభివృద్ధి అధికారి పుష్పలత, ఆబ్కారీ అధికారి చంద్రశేఖర్, కార్పొరేటర్లు పోశాల పద్మ, భోగి సువర్ణ, చింతాకుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సురేఖ చిత్రంలో కలెక్టర్ డా.సత్యశారద

● భారత పత్తి సంస్థ (సీసీఐ) రైతులు తీసుకొచ్చే పత్తిలో తేమ 8-12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని ప్రకటించిందని.. అకాల వర్షాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 18 శాతానికి పెంచాలని తెలంగాణ రైతుసంఘం నాయకులు మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేశారు.

● సీసీఐ కేవలం నోటిపై చేసిన మిల్లుల వద్దే పత్తి కొనుగోళ్లు చేస్తుండటంతో మార్కెట్‌ను నమ్ముకొని జీవిస్తున్న సుమారు 5 వేల మంది కార్మికులు నష్టపోతున్నారని కార్మిక వర్గాల నాయకులు వాపోయారు. ఎనుమాముల మార్కెట్‌కు వచ్చిన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. తద్వారా కార్మికులకు పనికల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖను కోరారు.

కరీమాబాద్: గ్రామ దేవత బొడ్రాయి దయ ప్రజలందరిపై ఉండాలని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. కరీమాబాద్ సాకరాశికుంట, శాంతినగర్‌లో సోమవారం నిర్వహించిన నూతన బొడ్రాయి గ్రామదేవత ప్రతిష్ఠాపన మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణు, మేడిది రజిత, బొడ్రాయి ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

రామన్నపేట: లోక కల్యాణార్థం వరంగల్ పోతనరోడ్ మణిద్వీప గార్డెన్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు సహస్ర చండీయాగం నిర్వహిస్తున్నారు. సోమవారం స్థాపనపూజ, గణపతి హోమం, యోగిని హోమం తదితర పూజలు చేశారు. మంత్రి సురేఖ, కార్పొరేటర్ అనిల్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

'రిజర్వాయర్ ప్రతిపాదనతో అవస్థలు'

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నల్లబెల్లి మండలం గోవిందాపూర్ శివారులోని రంగాయ, ఎర్రాయ చెరువులను కలిపి రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదనను ఉప సంహరించుకోవాలని రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం జిల్లా పాలనాధికారి డా.సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. రంగాయ, ఎర్రాయ చెరువులను రిజర్వాయర్ చేయడం వల్ల 8 గ్రామాలు, 5 వేలకు పైగా ఎకరాలు, 10 వేల కుటుంబాలు నిరాశ్రయులవుతారన్నారు. గోవిందాపూర్ శివారులోని మూడు చెక్కలపల్లి, ఆశ్రవెల్లి లైన్ తండా, మురళీనగర్, ఇట్టియ తండా తదితర గ్రామాల ప్రజలు ముంపునకు గురవుతారని తెలిసి కూడా. . స్థానిక ఎమ్మెల్యే రిజర్వాయర్ ప్రతిపాదన పెట్టడం సరైన నిర్ణయం కాదన్నారు. గూబరాజు, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యఆరోగ్య అధికారిపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్యఆరోగ్య అధికారి డా.వెంకటరమణపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీలో అవకతవకలకు సంబంధించి డీఎంహెచ్‌వోనే ప్రధాన పాత్ర పోషించారని ఆరోపించారు. తడుగుల విజయ్, కట్ల రాజశేఖర్, బొట్ల నరేశ్ పాల్గొన్నారు

అంతర్గత సమీక్ష.. అధికారులపై ఆగ్రహం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మౌనంగా, ప్రశాంతంగా ఉండే కమిషనర్ డా.అశ్విని తానాజీకి కోపమొచ్చింది. వింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం బల్దియా సమావేశ మందిరంలో ప్రజావాణి ముగియగానే అన్నివిభాగాల పనితీరును అంతర్గతంగా సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వెనుకంజలో ఉన్న టీపీఎస్, టీపీబీఓలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక వార్డు అధికారి రోజూ 20, టీపీఎస్ 120 అర్జీలు పరిశీలించాలన్నారు. టీపీఓలు, ఏసీపీ, ఇన్‌ఛార్జి సిటీప్లానర్ ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. వరంగల్ ప్రాంతంలోని శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్‌ను వివరాలు అడిగితే బేలచూపులు చూశారు. సూపర్‌వైజర్‌కు వివరాలు తెలియకపోతే ఎలా? అని మండిపడ్డారు. అతన్ని సమావేశం నుంచి బయటకు పంపించి, తాఖీదు జారీ చేయాలని ఆదేశించారు. వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, కాలనీల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని కమిషనర్ అశ్విని తానాజీ తెలిపారు. అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, వింగ్ అధికారులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు

శివనగర్, న్యూస్‌టుడే: వరంగల్- ఖమ్మంరోడ్డు ఇసుకఅడ్డా సమీపంలోని పెట్రోల్‌పంపు ఎదుట ఈ నెల 19న అర్ధరాత్రి పగిలిన బల్దియా ప్రధాన పైపులైన్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ సమస్యపై ఈనాడులో 'పైపులైన్ పగిలి భారీగా తాగునీటి వృథా' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బల్దియా ఏఈ దొడ్డిపాటి హరి ఆధ్వర్యంలో సోమవారం లీకేజీని గుర్తించారు. సుమారు 20 ఏళ్ల క్రితం వేసిన పైపు నుంచి భగీరథ నీరు సరఫరా చేసే సమయంలో ఒత్తిడి పెరిగి పైపు పగిలి ఉంటుందని భావిస్తున్నారు. గతంలోనూ ఇక్కడే లీకేజీ ఏర్పడగా.. మరమ్మతులు చేశారు. సోమవారం చేపట్టిన మరమ్మతులకు రెండుసార్లు వర్షం అంతరాయం కలిగించింది. లీకేజీ ఏర్పడిన గుంతలోకి వరదనీరు రావడంతో మోటారు సాయంతో తోడేశారు. పగిలిన పైపులైన్‌పై మందమైన ఇనుప రేకుతో వెల్డింగ్ చేశారు. లీకేజీ కారణంగా నీటి సరఫరా నిలిచి సోమవారం శివనగర్ ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు మరో రెండురోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

నిండిపోయిన డంపింగ్‌యార్డు



రాంపూర్‌లోని గ్రేటర్ వరంగల్ డంపింగ్‌యార్డులో వ్యర్థాలు పేరుకుపోయాయి. చెత్తను ఎప్పటికప్పుడు పక్కకు నెట్టాల్సిన డోజర్లు, హిటాచీ యంత్రాలు లేకపోవడంతో చెత్త గుట్టలుగా పోగైంది. డంప్ చేయడానికి స్థలం లేక వాహనాల చోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డంపు చేసేందుకు వెళ్లిన వాహనాలు బారులుతీరాయి. స్థలం లేకపోవడంతో రెండు ట్రిప్పులు వేయాల్సిన ట్రాక్టర్లు ఒకే టిప్పునకు పరిమితం అయ్యాయి. **- న్యూస్‌టుడే, కార్పొరేషన్**

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాలకుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం పాలకుర్తి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గీసుకొండ మండలం నంద్యాతండాకు చెందిన బదావత్ రాజు(20), అతని స్నేహితుడు బదావత్ సతీశ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పాలకుర్తికి వస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడూరు ప్రధాన రోడ్డు మీదుగా పాలకుర్తికి వచ్చే క్రమంలో వావిలాల శివారు నారబోయినగూడెం వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. క్రమంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా, రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సతీశ్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



రాజు (పాత చిత్రం)

కాంగ్రెస్ నాయకుల విమర్శలు సరికాదు

పర్వతగిరి, న్యూస్‌టుడే: రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా నగదు అందించాలని భారాస పక్షాన అడగడం తప్పన్నట్లు.. కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని కల్లెడ పీఏసీఎస్ ఛైర్మన్ మనోజ్‌గౌడ్, భారాస మండల కన్వీనర్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం భారాస నాయకులు, కార్యకర్తలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మనోజ్‌గౌడ్, రాజేశ్వర్‌రావులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాంతియుతంగా భారాస ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా.. కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు 'భారాస ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని, అంబేడ్కర్ సెంటర్‌లో చర్చలకు రావాలని సవాల్ చేసినట్లు' పేర్కొన్నారు. వారి సవాల్‌ను స్వీకరించి భారాస మండల పార్టీ ఆధ్వర్యంలో చర్చలకు వస్తే కాంగ్రెస్ నాయకులు మాత్రం ప్రకటనలకే పరిమితం అయ్యారని విమర్శించారు. భారాస నాయకులు పంతులు, సోమేశ్వర్‌రావు, వెంకన్న, యుగేందర్‌రావు, శ్రీనివాస్, మాధవరావు, బాలరాజు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న భారాస నాయకులు

పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

నర్సంపేట, న్యూస్‌టుడే: పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. పోలీసు అమరుల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం రాత్రి నర్సంపేటలో ఏసీపీ నేతృత్వంలో సీఐ రమణమూర్తి, ఎస్సైలు రవికుమార్, అరుణ్, పోలీసు సిబ్బంది పోలీస్‌స్టేషన్ నుంచి నెక్కొండ రోడ్డు కూడలి వరకు వెలుగుతున్న కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పోలీసు అమరుల చిత్రపటాల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.



నర్సంపేటలో కొవ్వొత్తులతో ప్రదర్శన

మామునూరు: మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం అమరవీరుల స్తూపానికి కమాండెంట్ రామ్‌ప్రకాశ్, అధికారులు, అమరుల కుటుంబాలు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరులను స్మరించుకుంటూ సాయుధ పోలీసులు మౌనం పాటించారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు మన దేశంలో అమరులైన 214 మంది పోలీసుల పేర్లను చదివి వినిపించారు. దేశ రక్షణలో భాగంగా అమరుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు శ్రీనివాసరావు, వీరన్న, ఆర్‌లు సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ ఉన్నారు.



మామునూరు బెటాలియన్‌లో.. కమాండెంట్ రామ్‌ప్రకాష్, అధికారులు

★ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో అమరవీరుల స్తూపానికి ప్రిన్సిపల్ పూజ, అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డీఎస్పీలు రవీందర్, వెంకటేశ్వర్‌రావు, సతీష్, అసిస్టెంట్ కమాండెంట్‌లు పాండునాయక్, భిక్షపతి, ఆర్ఐలు ఉన్నారు.

మెహంతిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నర్సంపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని హత్య చేస్తామని సామాజిక మాధ్యమం వేదికగా బెదిరించిన బుద్ధాదిత్య మెహంతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎన్ఎస్‌యూఐ నాయకులు నర్సంపేట సీఐ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు జె.అఖిల్, నియోజకవర్గ అధ్యక్షుడు బి.భరత్, పట్టణ అధ్యక్షుడు కె.ఉత్తమ్ తదితరులు ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న ఎన్ఎస్‌యూఐ బాధ్యులు

ఎస్సారెస్పీ కాల్వ పరిశీలన

దుగ్గొండి, న్యూస్‌టుడే: దుగ్గొండి మండలంలోని ఎస్సారెస్పీ డీబీఎం 38 ఉపకాలువను సోమవారం ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ అనిల్‌కుమార్ పరిశీలించారు. కాలువ చివరి ఆయకట్టు రైతుల ఫిర్యాదు మేరకు గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, ములుగు మండలం జాకారం మీదుగా కాలువ నీరు పొలాలకు చేరుతుందా ? లేదా? నీటిని ఎవరైనా దుర్వినియోగం చేస్తున్నారా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ సాల్మన్, రాజు, డీఈ రామకృష్ణ, గిరిధర్, ఏఈ సతీశ్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

నల్లబెల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నాదేవి అన్నారు. ఆమె సోమవారం స్థానిక ఉన్నతపాఠశాలలో ఓటరు నమోదు, ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఎండీ రవూఫ్, కుమారస్వామి, రాజిరెడ్డి, సంతోశ్, బుచ్చన్న, జ్యోతి, పద్మజ పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఖానాపురంన్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా మానిటరింగ్ అధికారి సృజన్‌తేజ సూచించారు. ఆయన సోమవారం బుధరావుపేట, మంగళవారిపేటలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితంలో పట్టు సాధించేలా విద్యార్థులపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీఆర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సృజన్‌తేజ ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన జల్లి, అమీనాబాద్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను, చెన్నారావుపేటలోని కస్తూర్బాగాంధీ గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఎంఈవో సరళ, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది అశోక్, స్వప్న, సీఆర్పీలు సంపత్, శిల్ప పాల్గొన్నారు.

రైళ్ల హాల్టింగ్‌కు కృషి చేయాలి

నెక్కొండ, న్యూస్‌టుడే: నెక్కొండ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్టింగ్ కోసం గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు కృషి చేయాలని నెక్కొండ రైల్వే అవేర్‌నెస్ ఫోరం కన్వీనర్ వెంకటనారాయణ అన్నారు. స్థానిక అతిథిగృహంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా పోరాటం చేయాలని వివిధ పార్టీల నాయకులు సూచించారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఒప్పంద, పొరుగు సేవల కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని పౌర సరఫరాల ఎంఎల్ఎస్ గోదాము ప్రాంగణంలో సోమవారం జరిగిన తెలంగాణ పౌర సరఫరా హమాలీ సంఘం కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 31న అన్ని గ్రామాల్లో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించాలన్నారు. సంఘం నాయకులు నర్సింగం, మల్లయ్య, మహేందర్, రవి, కుమారస్వామి, కిషోర్, వీరస్వామి, కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మహిళలే మూల స్తంభాలు



లక్ష్మీపురం పంచాయతీలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యరెడ్డి

దుగ్గొండి, న్యూస్‌టుడే: కుటుంబ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మహిళలే మూల స్తంభాలని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు పరిశీలక బృందం (ఎన్ఎల్ఎం) సారథి సుబ్రహ్మణ్యరెడ్డి అన్నారు. దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం, పొనకల్, గిర్నిబావి గ్రామాల్లో సోమవారం ఆయన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న కోళ్లఫారం, హోటల్, అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలు, మల్బరీ తోటను పరిశీలించారు. బృందం సభ్యుడు జయప్రకాశ్, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్, ఏపీవో శ్రీనివాస్, లైజన్ అధికారి సుధాకర్‌లకు మహిళలు బతుకమ్మలు, కోలాటంతో స్వాగతం పలికారు.

నర్సంపేట నియోజకవర్గం

శుద్ధ నీటిని సరఫరా చేద్దాం

నెక్కొండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో శుద్ధమైన తాగు నీటిని సరఫరా చేద్దామని వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేందర్ అన్నారు. నెక్కొండలో నిర్వహిస్తున్న మంచినీటి సహాయకుల శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. చేతిపంపు మరమ్మతులపై మెకానిక్‌లు గ్రామ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ రాజేష్, ఏఈఈ వంశీ తదితరులు పాల్గొన్నారు.

'సాయిబాబా మృతికి కేంద్రానిదే బాధ్యత'

నర్సంపేట, న్యూస్‌టుడే: దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న సామ్రాజ్యవాద విష సంస్కృతిపై కళారూపాలతో ప్రజలను జాగృతం చేస్తామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నూతన అధ్యక్షుడు పి.వేణు అన్నారు. నర్సంపేటలోని రాయల రమేశ్‌నగర్‌లో నిర్వహిస్తున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సభలు సోమవారం ముగిశాయి. వేణు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానంలో జ్యోతిష్యశాస్త్రాన్ని, మంత్ర తంత్రాలను పాఠ్యాంశాల్లోకి చేర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సాగిస్తున్న హత్యాకాండను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ సభలో తీర్మానం చేశారు. అణగారిన ప్రజల కోసం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గళమెత్తుతోందన్నారు. అంతకు ముందు ఆ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా పి.వేణు, ఉపాధ్యక్షుడిగా ఇట్టబోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా ఇడంపాక శ్రీశైలం, సహాయ కార్యదర్శిగా జక్కం కొండలరావు, కోశాధికారిగా ఎస్.కుమారస్వామి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



అభివాదం చేస్తున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు

గుట్కా పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిషేధిత గుట్కాను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. మిల్స్ కాలనీ ఠాణా పరిధిలో సాకరాసికుంటకు చెందిన మురళీకి చెందిన శ్రీలక్ష్మి పాన్ దుకాణంలో గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. వివిధ కంపెనీలకు చెందిన సుమారు రూ. 45వేల విలువ చేసే గుట్కా దొరికింది. ఈ మొత్తం స్వాధీనం చేసుకొని కేసు నమోదు, విచారణకు మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి(హనుమకొండ), న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు సుబేదారి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుంకరి జ్యోతి బహుమతులు, షీల్డులు అందజేశారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందించారు. జ్యోతి మాట్లాడుతూ అందరి సహకారంతో క్రీడా పోటీలను మూడు రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామన్నారు. ఎస్బీఐ సుబేదారి బ్రాంచి మేనేజర్ అచ్యుత్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు.